





క్రీస్తు రాకడకు : రాజమహేంద్రవరంలో ఒక చర్చి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైటింగ్

రక్షకుడు..ఉదయించినాడు!



హ్యాపీ క్రిస్మస్ : చిన్నారులకు కేక్ తినిపిస్తున్న మంత్రి దుర్గేష్



గిఫ్ట్ తెచ్చేశాం : రాజానగరం మండలం కానవరంలో క్రిస్మస్‌తాత వేషధారణలో చిన్నారులు

క్రిస్మస్ పండుగ వచ్చేసింది.. సందడి తెచ్చేసింది.. ఎటు చూసినా క్రిస్మస్ కాంతులు వెదజల్లుతున్నాయి.. చర్చిలు విద్యుత్ ధగ ధగలతో మెరిసిపోతున్నాయి.. మరో వైపు విశ్వాసులు చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్నారు.. యువత వీధుల వెంట హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ ర్యాలీలు చేస్తూ తమ ఆనందం చాటుకుంటున్నారు.. డిసెంబరు ఆరంభం నుంచి జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా చేస్తున్నారు. నేడు క్రీస్తు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.. త్వరగా రానున్న ఏసు.. త్వరగానే రమ్ము తండ్రి అంటూ కొలిచారు..

- వివరాలు 8వ పేజీలో

ఇంటింటా ఎన్‌సీడీ సర్వే

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేతో పాటు విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌లను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు.ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆహారపు అలవాట్లు,మెడికల్ హిస్టరీ అడిగి తెలుసుకుంటున్నారన్నారు. బీపీ, షుగర్, అనీమియా, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వారా కేన్సర్‌కు సంబంధించిన లక్షణాలను ప్రజలకు వివరిస్తూ వారికి ఇంటివద్దనే స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారన్నారు.జిల్లా ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ ఎన్‌సీడీ సర్వే, విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ వివరాలు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు దాటిన జనాభా 15,12,332 మంది ఉంటే ఇప్పటి వరకూ 2,40,134 మందికి స్క్రీనింగ్ చేశారని పేర్కొన్నారు.రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ చేపడుతున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలలో 55 శాతం, స్కూళ్లలో 25 శాతం స్క్రీనింగ్ నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

రాజమహేంద్రిలో రాత్రి 11 వరకూ షాపులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం రాత్రి 11 గంటల వరకూ వ్యాపార సంస్థలు తెరుచుకునేందుకు జిల్లా పోలీసు అధికారులు అనుమతివ్వడం జరిగిందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌ను ఆయన కార్యాలయంలో ఛాంబర్ అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణమూర్తి, గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వంటెద్దు సూరిబాబు, ఇయ్యపు మురళీధర్ తదితరులు కలిశారు. పండుగల నేపథ్యంలో తమకు వ్యాపార వేళలు పెంచాలని ఎస్పీని కోరగా వెంటనే స్పందించి అనుమతిచ్చారని తెలిపారు. అయితే ప్రతి షాపు వద్ద నిఘా కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి పూట పోలీసులు షాపుల తనిఖీలకు వచ్చిన సమయంలో నిఘా కెమెరాలు పర్యవేక్షణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారన్నారు.

అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

7

రుడాలో ఫైల్స్ త్వరగా క్లియర్ చేయండి

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి



కొవ్వూరులో టిడ్కో ఇళ్లు

బొమ్మూరులో ఇంటిని అల్లుకున్న నిర్లక్ష్యం

పేద గూటికి.. పండగొచ్చేనా!

టిడ్కో ఇళ్లపై పేదింట ఆశలు

మేడంటే మేడా కాదు..గూడంటే గూడు కాదు.. అందంగా కట్టుకున్న పొదరిల్లు మాది.. పొదరిల్లు మాది..ఐదేళ్ల కిందట టిడ్కో గృహాలపై పేదల పాట ఇది.. అంత వేగంగా గృహ నిర్మాణాలు సాగాయి మరి. రేపో మాపో ఇల్లు వచ్చేస్తుందని చాలా మంది పేదలు ఆశలు పెట్టుకున్నారు. 2019లో జగన్ మాటలు నమ్మి ఓటేశారు..ప్రభుత్వం మారింది.. ఐదేళ్లు పేదిళ్ల వైపే చూడలేదు..ఎందుకంటే పేదింటికి వైసీపీ చీడ పట్టేసింది. దీంతో పేదలు నలిగిపోయారు. టైమ్ చూసుకున్నారు..ఎన్నికలు రావడంతో ఓటుతో జగన్‌ను దింపేసి కూటమికి ఛాన్స్ ఇచ్చారు..ప్రస్తుతం టిడ్కో ఇళ్లకు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపడుతోంది.



బొమ్మూరులో నిర్మించిన టిడ్కో గృహాలు

- పేదింటికి పట్టిన వైసీపీ చీడ
- గత ఐదేళ్లూ గాలికొదిలేశారు
- ఒక్క ఇంటినీ ఇవ్వని జగన్
- 2019లో నిర్మాణాలు పూర్తి
- ఐదేళ్లు కానరాని వసతులు
- ఈఎంఐలతో సతమతం
- పట్టించుకోని నాయకులు
- కూటమి రాకతో ఆనందం
- టిడ్కో పనులపై కదలిక

రాజమహేంద్రవరం/కొవ్వూరు/ నిడదవోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా ప్రజలకు సంబంధించిన కనీస అవసరాలు తీర్చే బాధ్యత సుకోవలసిందే.కానీ ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికలైన తర్వాత మరో మాట చెప్పేధోరణి గత ప్రభుత్వంలో బాగా కనిపించింది. పేదల ఇంటి కలను గత వైసీపీ ప్రభుత్వం దూరం చేసింది. జ గనన్న ఇళ్లు అంటూ హడావుడి చేసినా టీడీపీపై కోపంతో కట్టిన ఇళ్లను చెదలు పట్టించింది. ఐదేళ్లు ఎందుకూ పనికిరాకుండావదిలేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పట్టణ ప్రాంతాల్లో వేలాది మంది పేదలకు అందమైన ఇంటిని ఇవ్వాలనే లక్ష్యంతో రాజమహేంద్రవరం, నిడదవో లు, కొవ్వూరు పట్టణాలకు దగ్గరగా టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే.2019 ఎన్నికలకు ముందే మొదటి దశ ఇళ్లను ఇవ్వడానికి సిద్ధం చేసింది. అప్పట్లో గృహ ప్రవేశాలు కూడా చేశారు. కానీ 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టడం మొదలైంది.టిడ్కో గృహాలు ఐదేళ్లు ధ్వంసమయ్యాయి. లబ్ధిదారులకు దక్కకుండా వృథాగా పడి ఉన్నాయి.కొన్ని శిధిలమైపోయాయి.రెండో దశలో మొదలైన ఇళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.

అధ్వానంగా తయారైన ఇళ్లు..

టిడ్కో ఇళ్లను టీడీపీ చాలా వరకూ పూర్తి చేసింది.అయితే తర్వాత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. దీంతో ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించలేని పరిస్థితి నెలకొంది. ఇవాళ మళ్లీ కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకుని..అప్పగిస్తుందనే ఆశలో లబ్ధిదా రులు ఉన్నారు. అయితే ఐదేళ్లు పట్టించు కోకపోవడంతో ఇళ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇళ్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వర్క్, ప్లంబింగ్ వర్కులకు సంబంధించిన మెటీరియల్ చోరీకి గురైంది. నామవరంలో రెండో దశలో నిర్మించిన 1104 ఇళ్ళలో రూ.3 కోట్ల విలువైన ఎలక్ట్రికల్,ప్లంబింగ్ మెటీరియల్ చోరీకి గురైనట్టు అక్కడి కాంట్రాక్ట తరపు వ్యక్తులు చెబుతున్నారు.

ప్రస్తుతం బొమ్మూరు మొదటి దశ, తొర్రేడు, సింహాచలం నగర్ కాలనీల్లో కొంతమంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు.మిగతా చోట్ల కనీస మౌలిక సదుపాయాల్లేవు.నామవరం డి.బ్లాక్ వద్ద నిర్మించిన ఇళ్లలో 96 ఇళ్లను లబ్ధి దారులకు అప్పగించినా ఒక్కరే ఉంటున్నారు. నిడదవోలులో శ్లాబ్ కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది.ఇక కొవ్వూరులో నిర్మాణం పూర్తయినా మౌలిక వసతుల్లేవ్.

జిల్లా పరిధిలో రాజమహేంద్రవరంలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కోఇళ్లు నిర్మించారు. అందులో 5,574 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలా తక్కువ మంది మాత్రమే గృహప్రవేశాలు చేసుకున్నారు. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. నిడదవోలులో 1755 ఇళ్లు మంజూరు కగా 1248 ఆరంభించారు. కొవ్వూరు 480 మంజూరు కాగా 480 ఆరంభించారు. కానీ మధ్యలో ఆపేశారు. బొమ్మూరులో మొదటి దశలో 2,528 ఇళ్లు నిర్మించారు.తొర్రేడులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళేశ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు. ఇప్పటి వరకూ బొమ్మూరులో నిర్మించిన ఇళ్లలో 2,528 ఇళ్లను లబ్ధిదార్లకు అప్పగించగా 1977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు.బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు.అక్కడ

ఎక్కడ ఇళ్లు అక్కడే!

ఎస్‌టీపీ పనులు పూర్తి చేయవలసి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులు పొందారు. ధవళేశ్వరం(వడ్డెరకాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్పగించారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లలో 96 లబ్ధిదారులకు అప్పగించినా ఎవరూ రాలేదు. కేవలం ఒక్కరు మాత్రమే ఇక్కడ నివాసం ఉంటున్నారు. కనీస సౌక ర్యాలు లేవు. రెండో దశలో నామవరంలో 1104 ఇళ్లు, సింహాచలనగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1200 నిర్మించారు.ఇవి ఇంకా పూర్తి కాలేదు.మౌలిక సదుపాయాలు కల్పించలేదు.నిడదవోలు పట్టణం తీరుగూడెంలో 1755 మంజూరు కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు.లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా జరగలేదు.ఇళ్ల నిర్మాణం ఆగింది. బిల్లులు రాకపోవడంతో పెండింగ్‌లో పడింది.

3 రకాలుగా ఇళ్ల నిర్మాణం

జిల్లాలో మొత్తం మూడు రకాలుగా ఇళ్లను విభజించారు. 300 ఎస్‌ఎఫ్‌టీ, 365 ఎస్‌ఎఫ్‌టీ, 430 ఎస్‌ఎఫ్‌టీగా లబ్ధిదార్లను ఎంపిక చేశారు. 300 ఎస్‌ఎఫ్‌టీ ఇళ్లను ఉచితంగా ఇచ్చారు. ఇక 365 ఎస్‌ఎఫ్‌టి ఇళ్లకు రూ.3.15 లక్షల రుణం, రూ.25 వేలు లబ్ధిదారుడి వాటాగా నిర్ణయించా 430 ఎస్‌ఎఫ్‌టీ ఇళ్లకు రూ.3.65 లక్షలు రుణం, రూ.50వేలు లబ్ధిదారుడి వాటాగా నిర్ణయించారు. మొదట్లో టీడీపీ ఎంపిక చేసిన లబ్ధిదార్లలో కొంతమందిని వైసీపీ మార్చేసింది. రుణాలు కూడా సరిగ్గా ఇప్పించలేదు.



బొమ్మూరులో అసంపూర్తిగా నిలిచిన ఓహెచ్‌ఆర్

ఈఎంఐలతో సతమతం

సొంతింటి కల నెరవేరుతుందని ఎంతో ఆశతో లక్ష రూపాయలు చెల్లించిన లబ్ధిదారులు కట్టిన లక్ష సొమ్ముకు వడ్డీలు కట్టలేక, మరో పక్క నివాసం ఉంటున్న ఇంటికి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. మరో పక్క టిడ్కో గృహాలపై రుణాలు మంజూరుచేసిన బ్యాంకర్లు లబ్ధిదారులను ఈఎంఐలు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాలు అందజేస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



టిడ్కో ఇళ్లపై సమీక్ష

కలెక్టరేట్‌లో ఇళ్లపై చర్చ

కూటమి అధికారంలోకి రావడంతో ఈ ఇళ్లను త్వరగా పూర్తి చేసి అప్పగిస్తారనే ఆశ మొదలైంది. దానికి తగ్గట్టుగానూ యంత్రాంగం కదులుతుంది. కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్ ఇతర అధికారులతో టిడ్కో ఇళ్ల పరిస్థితిని సమీక్షించారు.

కొవ్వూరులో 480 కట్టేశారు.. వదిలేశారు?

కొవ్వూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని పెద తాళ్లపుంతలోని ఎన్టీఆర్‌నగర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో 2018 మార్చి 2వ తేదీన రూ.31.27 కోట్లతో 480 గృహాల నిర్మాణం చేపట్టారు. వాటిలో 300 చదరపు అడుగులు సింగిల్ బెడ్ రూమ్ గృహాలు 240, 430 చదరపు అడుగులు డబుల్ బెడ్‌రూమ్ గృహాలు 240 నిర్మించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు గృహ నిర్మాణం పూర్త యింది. గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే గృహప్రవేశం చేసుకోవచ్చు. అయితే వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు ఆ పని చేయలేకపోయింది. టిడ్కో గృహాల సముదాయంలో నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేసింది. దీం తో కొన్నిళ్లు దెబ్బతిన్నాయి. టిడ్కో గృహాల సముదాయం పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిలా మారింది.లబ్ధిదారులకు ఇదిగో ఇస్తున్నాం.అదిగో ఇస్తున్నాం అన్నారే తప్ప వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాల వద్ద చిన్నపనిచేసిన పాపాన పోలేదు.



చెక్కేయండి.. జగన్ బొమ్మలు!

అంతా నా ఇష్టం.. అంతా నా ఇష్టం.. అన్నారు గత సీఎం జగన్.. కనిపించిన చోటల్లా తన బొమ్మను వేసేసుకున్నారు..అది భూమీ లేదు.. పాస్‌బుక్‌లేదు.. రేషన్‌కార్డు లేదు.. చివరికి ఇంటి పట్టాలపై కూడా ఆయన ఫొటోనే.. అంతా చూశారు.. చివరిలో పొలం సరిహద్దు రాళ్లపైనే ఆయన ఫొటోనే వేశారు..రైతులకు ఏమీ అర్థం కాలేదు.. ఎవరి పొలం వాళ్ల ఆధీనంలోనే ఉండాలని రైతులు కోరుకుంటారు.. మరొకరిని రానీయరు.. తమ పొలంలో వేరొకరిని చూడడానికి రైతులు ఇష్టపడరు.అయితే దర్జాగా జగన్ మాత్రం సరిహద్దు రాళ్లపై తన బొమ్మలు విచ్చలవిడిగా వేసేసుకున్నారు.. రైతుల నుంచి ఆ బొమ్మలు తొలగించాలని పెద్ద ఎత్తున అర్జీలు రావడంతో అధికారులు తొలగింపు చర్యలు చేపడుతున్నారు.. కొవ్వూరు మండలం సీతంపేట గ్రామ సచివాలయం వద్ద తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం చిగురులంక, మద్దూరులంకలకు సంబంధించి రెవెన్యూ సదస్సును నిర్వహించారు.ఆర్డీవో రైతుల నుంచి 12 వినతులు స్వీకరించారు. అక్కడే ఉన్న సర్వే రాళ్లపై జగన్ బొమ్మలను తొలగించడం చూశారు. - కొవ్వూరు

వేతన సవరణ కార్మికులు ఆమోదించాలి

- పేపరుమిల్లు యాజమాన్యంతో చర్చించిన నాయకులు
- రూ.12,500 పెంపునకు అంగీకారం.. కార్మికుల అసంతృప్తి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం పేపరు మిల్లు యాజమాన్యం కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన సవరణ చేయాలని మంత్రి దుర్గేష్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మిల్లు యాజమాన్యం, కార్మిక శాఖ కమిషనర్,కార్మికులతో మంగళవారం 2020-23 వేతన సవరణపై సమీక్షించారు. నాలుగు నెలల కిందట నిర్వహించిన సమావేశంలో ఆమోదయోగ్యమైన వేతన సవరణ చేయడం జరుగుతుందని పేపరుమిల్లు యాజమాన్యం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో రూ.12250ల వేతన పెంపునకు అంగీకారం తెలిపినా ప్రస్తుత సమావేశంలో రూ.12500లకే పరిమితం కావడంపై కార్మికులు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పేపరుమిల్లు యాజమాన్యం ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలను పాటించడం లేదన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు రూ.13 కోట్లు బకాయి మొత్తాన్ని చెల్లించాలన్నారు. వేతన సవరణ విషయంలో మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు.రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి వేతన సవరణ చేయాల్సి ఉన్నా యాజమాన్యం మొండి వైఖరి కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి నీటి వినియోగంపై ఆడిటింగ్ చేపట్టాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పేపరుమిల్లు యాజమా న్యం చేసిన అవినీతి, ఉల్లంఘనలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ విభజించు పాలించు అనే పోకడలో పేపరుమిల్లు యాజమాన్యం వ్యవహరిస్తున్నట్టు ఆరోపించారు.సమావేశంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జాయింట్ లేబర్ కమిషనర్ ఏ.రాణి, సహాయ కార్మిక అధికారి ఎస్కేజాబీనా,డీఎస్పీ ఏకే సుబ్బరాజు,పేపరుమిల్లు అసోసియేట్ డైరెక్టర్ అక్కినేని జయకృష్ణ,యాజమాన్యం ప్రతినిధులు మేనేజరు బాగ్లే,బిజాయి కుమార్‌సంకు, హెచ్ ఆర్ గణేష్,ఫైనాన్స్ హెడ్ రిషికాంత్‌గుప్తా, సీఎస్ఆర్ మేనేజరు డి.తాతారావు, కార్మిక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రక్షకుడు ఉదయించినాడు..

- ఆంధ్రజ్యోతి, అమలాపురం టౌన్

నేడే క్రిస్మస్

'నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించు..' అని క్రీస్తు పలికిన చిన్న వాక్యంలో అద్భుతమైన సందేశం ఉంది. దుర్మార్గులను, సన్మార్గులను, పతితులను, పవిత్రులను ఒకే దృష్టితో ప్రేమించగలిగే దివ్య మానసాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠించుకోవాలని క్రీస్తు చెప్పారు. మానవజాతికి సన్మార్గాన్ని చూపిన ప్రవక్తలెందరో ఉన్నారు.. వారిలో ఏసుక్రీస్తుకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంది. ప్రేమ.. కరుణ.. దయలకు ప్రతిరూపంగా ఏసుక్రీస్తు భువిపై మానవ రూపంలో జన్మించారు. ప్రతీ వ్యక్తి తోటివారిని ప్రేమగా చూడాలని.. దయతో క్షమించాలని.. కరుణామయులుగా మెలగాలని మానవజాతికి ఆయన అందించిన శుభసందేశం. అంతటి ప్రేమామయుని జన్మదినమంటే ఎందరికో పండుగే మరి. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి వ్యక్తి తనతో అన్వయించుకుని జీవిస్తే జగమంతా ప్రేమమయమే. పాపం చేసినవారికి శిక్ష విధించడం కాదు పాపమే మరణించాలని ఏసుక్రీస్తు పలికారు. సమస్త మానవాళి పాప పరిహారార్థం దేవుడు నరుడిగా జన్మించిన పవిత్రమైన రోజు క్రిస్మస్. సంపూర్ణ మానవత్వమే మనిషిని మహా పురుషుడిగా, దైవ స్వరూపుడిగా మారుస్తుంది. ఇదే క్రిస్మస్ పర్వదినం ద్వారా సమస్త మానవాళికి అందించే శుభసందేశం.



అమలాపురం మన్నా జూబ్లీ చర్చి ప్రాంగణంలో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటుచేసిన దీపాలంకరణలు



45 అడుగుల క్రిస్మస్ ట్రీ

పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డులో ఉన్న తండ్రీ కుమార పరిశుద్ధాత్మక మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరం క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఏర్పాటుచేసిన 45 అడుగుల క్రిస్మస్ ట్రీ, స్టార్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ప్రార్థనా మందిరం నిర్వాహకులు రౌతు సూరిబాబు, పరంజ్యోతి తెలిపారు. - పెద్దాపురం





సువార్త...

"భయపడకండి.. ఇదిగో ప్రజలందరికినీ కలుగబోవు మరో సంతోషకరమైన సువార్తమానం చెబుతున్నా.. దావీదు పట్టణంలో నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు.."

- లూకా సువార్త 2:10



నిత్య సంతోషమును అనుగ్రహించె క్రీస్తు

ఫిలిప్పీయులకు అందించిన సువార్తలో ఎల్లప్పుడూ ప్రభువు నందు ఆనందించుడి అన్న వాక్యాన్ని మరల మరలా గుర్తించాలి. ఐహిక విచారము నుంచి విడిపించి నీయందు నిరీక్షణతో వచ్చే సంతోషము అనుగ్రహించమని ఆ దేవాది దేవుడిని వేడుకోవాలి. ఈ లోక మాలిన్యమును తొలగించి నన్ను సరిచేయమని వేడుకుని నీ హృదయాన్ని పోలిన మనస్సు నాకు దయచేయండి అని రోమా 12:2 చెబుతుంది. నీ నీతి అనే వస్త్రాన్ని నాకు ధరింపచేసి నీతిని అనుసరించు వ్యక్తిగా సమాధానము కోరి దానిని వెంటాడు వ్యక్తిగా నన్ను చేయమని రోమా 14:17 చెబుతుంది. **- రెవ కేకే పాల్, సెయింట్ లూథరన్ చర్చ్, అమలాపురం**



దేవుడే నరుడై జన్మించినరోజు

సర్వలోక రక్షణ కొరకు దేవుడే నరుడై జన్మించిన రోజు క్రిస్మస్. సృష్టి ఆదియందు వాక్యముగా ఉన్నవాడు శరీరధారిగా ఏసుక్రీస్తుగా జన్మించెను. తాను నిర్మించిన మానవజాతి దేవుని చిత్తమునకు దూరమై వారి ఆత్మీయ రూపాన్ని పోగొట్టుకొనుచుండగా తిరిగి వారిలో ఆత్మీయ రూపాన్ని ఎరకపరిచే నిమిత్తం ఏసుక్రీస్తు భువిపై జన్మించెను(యోహాను 1:14, హెబ్రి 1:14,15). మానవాళి కొరకు ఎన్నో కార్యాలు జరిపించేందుకు క్రీస్తు మానవావతారునిగా జన్మించినట్టు(యోహాను 3:16) బైబిల్ చెబుతుంది. **- రెవ.కార్ల్‌డేవిడ్ కొమానపల్లి, మన్నాజూబ్లీ చర్చ్, అమలాపురం**



పాపముల నుంచి రక్షించే ఏసు

భయపడకండి ఇదిగో ప్రజలందరికినీ కలగబోవు మహా సంతోషకరమైన సువర్తమానమును నేను మీకు తెలియచేయుచున్నాను. దావీదు పట్టణమునందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు అని లూకా రెండవ అధ్యాయం పదవ వచనం చెబుతుంది. ఏసుకృప, సత్య, సంపూర్ణుడిగా మన మధ్యలో నివశించడం యెహోవా కృప.

- రెవ.ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరుజ్యోతి తాతపూడి, అమలాపురం



పోప్ జాన్‌పాల్-2 జ్ఞాపకార్థం కాంగో డెమొక్రటిక్ రిపబ్లిక్ దేశం 25 ఫ్రాంకుల నాణేన్ని విడుదల చేసింది. యాక్రిలిక్ పదార్థంతో తయారుచేయడం వల్ల ఆ నాణెం పారదర్శకంగా ఉంటుంది. 140 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన నాణెం బరువు కిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 401 నాణేలను మాత్రమే ముద్రించారు. అరుదైన ఈ నాణేన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు.

- అమలాపురం టౌన్

చర్చిలన్నీ ముస్తాబు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన క్రైస్తవులు







కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి మొదలైంది. డిసెంబరు మాసం మొదటి నుంచి క్రైస్తవ వేడుకలు నిర్వహించుకుంటున్నారు. డిసెంబరు 25న ప్రపంచమంతా జరుపుకుంటున్న క్రిస్మస్ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ కావడంతో బుధవారం చర్చిల్లో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో క్రీస్తు విశ్వాసులతోపాటు మిషనరీలు బలంగా పనిచేస్తుండడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం వంటి జిల్లా కేంద్రాలతోపాటు నగరాలు, గ్రామాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటారు. ఇప్పటికే పండుగ నిర్వాహణకు అవసరమైన కొనుగోళ్ల కోసం క్రీస్తు విశ్వాసులు దుకాణాలను సందర్శిస్తుండడంతో పట్టణాల్లో వీధులు, దుకాణాలు రద్దీగా మారుతున్నాయి. క్రిస్మస్ పండుగ సమీపిస్తుండగానే ఏసు ప్రభువు లోకానికి వచ్చాడన్న సందేశం చాటుతూ క్రైస్తవులు ఇళ్ల మీద క్రిస్మస్ తారను వేలాడదీయడం ఆనవాయితీ. నక్షత్రాన్ని పోలిన ఆకృతిలో లైటింగ్ ఏర్పాటు చేసి ఇంటిపై అలంకరిస్తారు. వాటి కొనుగోళ్లతోపాటు పండుగలో ప్రధాన భూమిక పోషించే క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాస్ వేషధారణలపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. ఎర్రని దుస్తులు, తెల్లని గడ్డం, పొడవు టోపీ ఆసక్తికరంగా ఉండే క్రిస్మస్ తాత వేషం ధరించడం క్రిస్మస్ సంబరాల్లో ఒకటి కావడంతో నగరంలో వీటి విక్రయాలు జరుగుతున్నాయి. వీటితోపాటు పండుగ నాడు అవసరమయ్యే కేకులను, స్వీట్లను ఆర్డర్లు చేస్తుండడంతో స్వీట్ దుకాణాలు కళకళాడుతున్నాయి. పిండి వంటల కోసం సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. కాగా మరోపక్క విద్యాలయాలు, తదితర చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అన్ని క్రైస్తవ మిషనరీలు, వసతి గృహాలు, చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

కారుణ్య నియామకాలు త్వరితగతిన చేపట్టాలి



జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కాకినాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు త్వరితగతిన కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ కాకినాడ జిల్లా ఎస్టీయూ పక్షాన జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబీకులు 91 మంది కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేశారన్నారు. జాప్యం వల్ల వారి కుటుంబ సభ్యుల ఆర్థిక, మానసిక ఇబ్బందుల దృష్ట్యా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి త్వరితగతిన పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి యు.శ్రీను, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణంరాజు, పి.శ్రీను. రామ్‌తేజ, మహేష్, శ్రీకాంత్ తదితరులు వున్నారు.

భవనం సమస్య పరిష్కారానికి వినతి

కాకినాడ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ భవనంపై తలెత్తిన సమస్యను పరిష్కరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు మంగళవారం జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు ఆధ్వర్యంలో జేసీ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా సహాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కాకినాడ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు, ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు

ఉపాధి హామీలో వ్యవసాయానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలి

లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవు

అధికారులకు అల్లూరి జిల్లా కలెక్టర్ హెచ్చరిక

చింతపల్లి, హుకుంపేట, వీఆర్ పురం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

పాడేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డులున్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని, ముఖ్యంగా వ్యవసాయానుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో వంద పంట కుంటలను నిర్మించాలన్నారు. లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం సక్రమంగా అందించాలని, బలహీనంగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎంపీడీవోలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని, గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయని చింతపల్లి, హుకుంపేట, వీఆర్ పురం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. లబ్ధిదారుల వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో నమోదు చేయకపోతే ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వర్తించని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయంలో ఎంపీడీవోలు అశ్రద్ధగా వ్యవహరించవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వభరత్, సబ్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, 22 మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శత చండీ మహా యాగం



మహా రుద్ర సహిత శత చండీ మహా యాగంలో పాల్గొన్న భక్తులు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీ మహా రుద్ర సహిత శత చండీ మహాయాగం మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. 108 యజ్ఞ కుండాలతో 116 మంది రుత్విక్కుల మంత్రోచ్చారణల మధ్య యాగ క్రతువును భక్త దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణం, విశ్వశాంతి, ధర్మపరిరక్షణ, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆది పరాశక్తి అనుగ్రహం ఈ నేలపై ఉండాలని శ్రీసన్నిధి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న మహా యాగంలో 50 మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగ సాధువులు పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

ఈదురుగాలులతో ఉప్పొంగుతున్న సముద్రం

కొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీరంలో వీస్తున్న ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం లోపలి నుంచి ఒడ్డుకు బలంగా గాలులు వీచడంతో సముద్రం ఉబ్బెత్తుగా మారుతోంది. కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. అలల తీవ్రతకు అమీనబాద్ సమీపంలోని పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న పంట పొలాల్లోకి సముద్రం నీరు ప్రవేశిస్తోంది. వరుస తుఫాన్లతో తీర ప్రాంత మత్స్యకారులు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





హైకోర్టు జడ్జి మన్మధరావు నుంచి పురస్కారం అందుకుంటున్న సీతాపతిరావు

సీతాపతిరావుకు జీవిత సాఫల్య పురస్కారం

కాకినాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్, ఏఐఎఫ్‌టీపీ, లోకల్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ తిరుపతిలో నిర్వహించిన సెమినార్‌లో ఏపీ హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మధరావు నుంచి బీఎస్ తిరుపతిరావు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈయన జీఎస్టీ చట్టంలోని వివిధ అంశాలపై 500 వ్యాసాలు రచించారు. సేవలకు గుర్తింపుగా 74, 75 గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలను కలెక్టర్ నుంచి అందుకున్నారు. వృత్తి నిపుణులకు సుమారు 200 సెమినార్లు, 175 శిక్షణా తరగతులు, సుమారు 500 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చారు. తిరుపతిరావును కాకినాడ ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

28న కాకినాడ ఐటీఐలో మినీ జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, గవర్నమెంట్ ఐటీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ కాలేజీలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18-35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు.


సత్యదేవుడి వ్రతమాచరిస్తున్న జిల్లా ఎస్పీ, కలెక్టర్ దంపతులు

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు

● వ్రతమాచరించిన కలెక్టర్, ఎస్పీ దంపతులు

అన్నవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ జిల్లా యంత్రాంగాన్ని నడిపించే అధిపతులు సహజంగా పలు పర్యాయాలు ఇద్దరూ ఒకే వేదికను పంచుకుంటుంటారు. వారిద్దరూ కుటుంబంతో ఒకే ఫ్రేమ్‌లో కనపడడం అరుదుగా ఉంటుంది. మంగళవారం వారిరువురి దంపతులు సత్యదేవుడి వ్రతమాచరించారు. వారే జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం వారిరువురు కుటుంబసభ్యులతో స్వామివారి వ్రతమాచరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎస్పీ, కలెక్టర్ దంపతులకు ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్.ఐ. హరిబాబు తదితరులు ఉన్నారు.

ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడపోర్టు వరకు చేపడుతున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే రహదారి విస్తరణ పనులు చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నిరంతర పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను గాలికి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతతో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

జీజీహెచ్‌లో మానసిక రోగి
ఆత్మహత్యాయత్నం

● విషమంగా విశాలాక్షి ఆరోగ్యం


కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న మానసిక వైద్యులు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి బట్టలకు నిప్పు అట్టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన 33 ఏళ్ల గొల్లపల్లి విశాలాక్షికి తండ్రి గణపతిరావ్, తల్లి చిట్టి మాణిక్యం ఉన్నారు. కాగా ఆమె పదేళ్లక్రితం డిగ్రీ పాసై టెట్‌కు ప్రిపేర్ అయ్యింది. ఆ సమయంలో ఆమెకు మెదడులో కణితి ఏర్పడి ఆమె మానసిక ప్రవర్తనలో తేడా వచ్చింది. దాంతో కుటుంబీకులు కాకినాడలోని ఓ ప్రైవేటు మానసిక ఆసుపత్రిలో చూపించారు. అనంతరం ఆమెకు విశాఖపట్నంలో మెరుగైన వైద్యం అందుతుండడంతో ఆమె ఆరోగ్యం కుదుటబడింది. 2022 నుంచి అక్కడ మందులనే వాడుతుంది. ఆమెకు గత 2 నెలల నుంచి విశాలాక్షి మానసిక ప్రవర్తన అసలు బాగుండకపోవడం, అరుపులు, కేక లు వేయడం, అందరినీ కొట్టడం చేస్తుండడంతో కుటుంబీకులు 15 రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌లోను సైకియాట్రీ వార్డులో చేర్పించారు. ఆమెలో విపరీత ప్రవర్తన ఉండ డంతో ఆమెను ఫిమేల్ సెల్‌లో ఉంచి ఆమెకు వైద్యులు చికిత్సను అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె అందరినీ కొడుతుండడంతో మంగళవారం ఆమెను లోపల ఉంచి గెడపెట్టి బయట ఆమె తల్లిదండ్రులు ఉన్నారు. విశాలాక్షికి ఇంజక్షన్ టైం అవ్వడంతో వారిరువురు నర్సు దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో విశాలాక్షి హాహాకారాలు చేస్తుండడం విని అక్కడకు వెళ్లి చూడగా లోపల నుంచి మంటలు రావడాన్ని గమనించారు. తలుపుతీసి చూడగా కూతురు కాలిపోతుండడాన్ని ఆ తల్లిదండ్రులు గమనించారు. అనంతరం అక్కడికి సైకియాట్రీ హెచ్‌వోడి డాక్టర్ రామచంద్రరావ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ చేరుకుని విశాలాక్షి 70 శాతం కాలిపోయిందని గుర్తించి ఆమెను అక్కడినుంచి బర్న్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్య చికిత్స అందజేస్తున్నారు. దోమల చక్రం వెలిగించుకునేందుకు అక్కడ పెట్టిన అగ్గి పెట్టితో ఆమె గౌన్‌కు నిప్పు అంటించుకున్నట్లు డాక్టర్ రామచంద్రరావ్ తెలిపారు. విశాలాక్షి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

● సబ్‌రిజిస్ట్రార్ సెలవుపై ఆగ్రహం

ముమ్మిడివరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ శివరామ్ మంగళవారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. భూముల మార్కెట్ విలువ పెంపుదల భాగాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శివరామ్ వచ్చిన సమయంలో సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. సబ్‌రిజిస్ట్రార్ సెలవు పెట్టారని సిబ్బంది చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేసి జిల్లా రిజిస్ట్రార్‌కు ఫోన్‌చేసి అడిగారు. జనవరి ఒకటి నుంచి భూమివిలువల పెంపు నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్లకు సెలవు ఇవ్వరాదని ఆదేశాలు ఉన్నప్పటికీ మీరు సెలవు ఎలా ఇచ్చారని జి ల్లా రిజిస్ట్రార్‌పై శివరామ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ సెలవు విషయం తనకు తెలియదని జిల్లా రిజిస్ట్రార్ చెప్పడంతో సబ్‌రిజిస్ట్రార్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరాలని ఆదేశించారు.

డాక్టర్ అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ

● రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు నమోదు సంతోషకరం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అమితంగా గౌరవించే పార్టీ బీజేపీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ తమ నాయకుడు అని అనేకసార్లు గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీ ఆయన్ను రెండుసార్లు ఎన్నికల్లో ఘోరంగా ఓడించి పార్లమెంట్‌లో అడుగు కూడా పెట్టనీయలేదన్నారు. బీజేపీకి రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం కానీ, రాజ్యాంగాన్ని మార్చాలనే భావన కానీ ఏనాడూ లేదన్నారు. ఆర్టికల్ 356ను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని, అశేష ప్రజాదరణ కల్గిన ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి తర్వాత ఆంధ్రప్రజల అభిమానం కారణంగా ఒత్తిడి రావడంతో మళ్లీ ఎన్టీఆర్‌కు పట్టం కట్టారని చరిత్ర దీనికి సాక్ష్యం అని అన్నారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణ విషయంలో రీ డిజైన్ చేయడంవల్ల కొంత వ్యయం పెరిగే అవకాశం ఉందని, ప్రతిపాదనలన్నీ రైల్వే బోర్డుకు వెళ్లాయన్నారు. కొవిడ్‌కు ముందు కొవ్వూరు, నిడదవోలు స్టేషన్లలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపేజీ తొలగించారని, దీన్ని పునరుద్ధరించేందుకు రెండుసార్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీల పొత్తులో ఉన్న నేపథ్యంలో నామినేటెడ్ పదవుల షేరింగ్ పాట్రన్‌కు అనుగుణంగానే తమ వారికి పదవులు ఇచ్చారన్నారు. తాను రాజమండ్రికే పరిమితం కాదు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా రాష్ట్రం అంతా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయం మా కార్యకర్తలకు అందరికీ బాగా తెలుసు అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి జరిగితే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో 184 కిలోమీటర్ల పొడవైన ఎర్రకాలువకు సంబంధించిన ఆధునికీకరణపై కలెక్టర్‌ను డీపీఆర్ కోరామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయని అన్నారు. దివంగత వాజ్‌పేయి కల నిజం చేస్తూ రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

29న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

రాజానగరం/రంగంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ రైతు దివంగత గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఈ నెల 29న రంగంపేట మండలం వడిశలేరు వద్ద నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం తెలిపారు. మానవాళి మనుగడకు మూలాధారమైన వ్యవసాయదారులు, పశుసంపదను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడీబీ రోడ్డుకు ఆనుకుని ఉన్న గన్నివారి తోటలో ఆ రోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఆరుగురు విజేతలకు ఆరు మోటార్ సైకిళ్లు, ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్, ద్వితీయ, తృతీయ బహుమతులుగా హోండా షైన్ బైక్‌లు, అలాగే 75 కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు బొప్పన బ్రహ్మాజీ రావు, కూటి కోటేశ్వరరావు మొబైల్ నెంబర్లు 98481 87368; 90006 62999ను సంప్రదించవచ్చన్నారు.

రుడాలో ఫైల్స్ త్వరగా క్లియర్ చేయండి

● రుడా తొలి సమీక్షలో చైర్మన్ బీవీఆర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా పరిధిలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫైల్స్ త్వరగా క్లియర్ చేయాలని చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. రుడా కార్యాలయంలో మంగళవారం రుడా వీసీ ,కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ప్లానింగ్ అధికారులతో ఆయన తొలి సమీక్ష నిర్వహించారు. రుడా నిధులతో జరుగుతున్న పనులు, ఇంజనీరింగ్ వర్కులు, ప్లానింగ్ విభాగంలో మాస్టర్ ప్లాన్లు, ఎల్ఆర్ఎస్, ఏపీడీపీఎంఎస్ ఫైల్స్‌పై చర్చించారు. త్వరలో రుడా పరిధిలోని నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని బొడ్డు వెంకటరమణ చౌదరి స్పష్టం చేశారు.


రుడా సమీక్ష సమావేశంలో చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, వీసీ కేతన్‌గార్గ్

హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీలు

● బాలికల విభాగంలో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జట్టు

● ద్వితీయ స్థానం విజయనగరం జట్టు ● ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్

● విజేతలకు బహుమతులు అందజేత ● ఫైనల్‌కు చేరిన బాలుర జట్టు

రావులపాలెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు మూడో రోజు మంగళవారం బాలికల విభాగం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌కు చేరిన శ్రీకాకుళం, విజయనగరం బాలికల జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, విజయనగరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానంగా కృష్ణ, విశాఖపట్నం జట్లు నిలిచాయి. ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకూ నువ్వానేనా అన్న విధంగా సాగడంతో క్రీడాభిమానులు ఆశక్తిగా వీక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షులు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, అంజనీకుమార్‌రెడ్డితో పాటు పలువురు విజేతలకు కప్, బహుమతులను అందజేశారు. అదేవిధంగా బాలురు విభాగానికి సంబంధించి శ్రీకాకుళం, విజనగరం జట్లు ఫైనల్స్‌కు చేరాయి.



ప్రథమ స్థానం సాధించిన శ్రీకాకుళం జట్టు, ద్వితీయ స్థానంలో నిలిచిన విజయనగరం బాలికల జట్టుకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

వినియోగదారుల వివాదాల
సత్వర పరిష్కారానికి కమిషన్ దోహదం

● కాకినాడ జిల్లా జేసీ రాహుల్ మీనా

సర్పవరం జంక్షన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వినియోగదారుల హక్కులు, రక్షణ, వివాదాల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. సోమవారం వాకలపూడి ప్యారీ షుగర్ ప్యాక్టరీలో మైత్రి ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, డీసీడీఆర్‌సీ సభ్యురాలు సీహెచ్ సుశీ, జిల్లా వినియోగదారుల సమాచార సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) అవగాహన సదస్సులో జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లితే సత్వర న్యాయం కోసం వినియోగదారుల వివాదాల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రంలో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. వస్తువులు, సేవలు, విలువల లోపాలు, భంగం వాటిల్లితే రూ.10నుంచి రూ50 లక్షల వరకు సంబంధిత కంపెనీ నుంచి పరిహారం పొందే వెసులుబాటు ఉందన్నారు. వివాదాల సత్వర పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో పాక్షిక న్యాయ సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. వస్తు, సేవల్లో లోపం జరిగితే ఇంటి వద్ద నుంచే వర్చువల్ విధానంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ-కామర్స్ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువుల సేవలు, నాణ్యతలో లోపాలుంటే కమిషన్‌కు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పాత్ర, సంబంధిత విభాగాలు, వినియోగదారుల వివాదాల సత్వర పరిష్కార కమిషన్‌పై డీఎస్‌వో టి. ప్రసన్నలక్ష్మీదేవి, డీసీడీఆర్‌సీ కాకినాడ ప్రెసిడెంట్ చెరుకూరి రఘుపతి వసంతకుమార్, సభ్యులు సీహెచ్ సుశీ, సీహెచ్ నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పోస్టర్‌ని జేసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వి.రామసుబ్రమణియన్, డీసీడీఆర్‌సీ కన్వీనర్, అడ్వొకేట్ భమిడి శివ ఎస్ఎస్ఎన్ మూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో నాటు సారా స్థావరాలపై..
ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల దాడులు

● 200 లీటర్ల నాటుసారా స్వాధీనం

● 18500 బెల్లం ఊట ధ్వంసం

● సారా డ్రమ్ములకు నిప్పు

ఎటపాక, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలోని గుండు వారిగూడెం, పిచ్చుకలపాడు గ్రామాల్లో మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇంటర్ స్టేట్ బోర్డర్స్ నాటుసారా నిర్మూలనలో భాగంగా ఆంధ్ర, తెలంగాణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, పోలీస్, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు జరిపారు. దాడుల్లో ఈరెండు గ్రామాల పరిధిలో 180 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 18,500 లీటర్లు నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెల్లం ఊటకు వినియోగించే 100 డ్రమ్ములను స్వాధీనం చేసుకుని, వాటికి నిప్పటించారు. గ్రామాల్లో నాటు సారా తయారీకి, రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆదేశసారం ఈఎస్, ఎస్టీఎఫ్ సింగంశెట్టి మధు, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ నేతృత్వంలో దాడులు జరిపారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాల ఎక్సైజ్, ప్రొహిబిషన్, పోలీసులు, సీఆర్పీ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


సారాను, డ్రమ్ములను చూపుతున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు, డ్రమ్ములకు నిప్పంటిస్తున్న దృశ్యం

అంతర్వేది తీరంలో డాల్ఫిన్ మృతి


అంతర్వేది తీరంలో మృతి చెందిన డాల్ఫిన్

అంతర్వేది, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో తరుచూ డాల్ఫిన్లు ఒడ్డుకు వసున్నాయి. రెండు రోజులుగా ఒక డాల్ఫిన్ అంతర్వేది సముద్ర కెరటాల తాకిడికి ఒడ్డుకు రావడంతో స్థానికులు డాల్ఫిన్‌ను చూసి కాపాడే ప్రయత్నం చేశారు. సముద్రం లోపలకు వెళ్లి డాల్ఫిన్‌ను వదిలారు. మంగళవారం ఆ డాల్ఫిన్ తిరిగి ఒడ్డుకు చేరి మృతి చెందింది. గతంలో సముద్ర తీరంలో పెద్ద పెద్ద తాబేళ్లు, భారీ చేపలు, డాల్ఫిన్లు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. సముద్రంలో బలమైన గాయాలపాలై నీటిలో ఈదుకుంటూ ప్రాణాపాయస్థితిలో ఉన్న తాబేళ్లు, డాల్ఫిన్లు, చేపలు సముద్ర తీర ప్రాంతానికి చేరి మృతి చెందుతున్నాయి.

ఏజెన్సీ తహశీల్దారు శ్రీనివాసరావుపై
కోర్టు ధిక్కారణ కేసు

● రేపు హాజరు కావాలని నోటీసు జారీ చేసిన హైకోర్టు

రంపచోడవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఏజెన్సీ లోని తహశీల్దారు చిన్నం శ్రీనివాసరావుపై రాష్ట్ర హైకోర్టులో నమోదైన కోర్టు ధిక్కార కేసులో ఈనెల 26న హాజరుకావాలని హైకోర్టు నోటీసు జారీ చేసింది. గిరిజన భూమి బదలాయింపు కేసులో తీర్పును అమలు చేయాలంటూ రెండు వేర్వేరు పార్టీలు రెండు వేర్వేరు కేసులు దాఖలు చేయగా, వాటిపై ఈ సంవత్సరం మార్చిలో హైకోర్టు ఉమ్మడిగా తీర్పు చెప్పి, మూడునెలలలోగా తగుచర్యలు తీసుకోవాలని అడ్డతీగల తహశీల్దారుకు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ తహశీల్దారు పనిచేసిన చిన్నం శ్రీనివాసరావు సదరు హైకోర్టు తీర్పును అమలు చేయలేదంటూ హైకోర్టులో కోర్టు ధిక్కారణ కేసు నమోదైంది. గతంలో అడ్డతీగల తహశీల్దారుగా పనిచేసిన సదరు శ్రీనివాసరావు ప్రస్తుతం గంగవరం మండల తహశీల్దారుగా పనిచేస్తున్నారు.

వేర్వేరు చోట్ల వెయ్యి గ్రాముల వెండి వస్తువుల అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం త్రీటౌన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన దొంగతనాలలో వెయ్యి గ్రాముల వెండి వస్తువులు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం రంగ్రీజుపేటకు చెందిన వీరగణేష్ అనే వ్యక్తి ఈనెల 7న కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకుని హైదరాబాద్ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మంగళవారం వచ్చాడు. ఇంటి తాళాలు తీసి లోపల బీరువా తెరిచి ఉండడంతో చూస్తే బీరువా పెట్టిన 750 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా లింగంపేటకు చెందిన దుర్గాదేవి అనే మహిళ తన ఇంటి కింద పోర్షన్‌కు ఈనెల 10న తాళాలు వేసి పై పోర్షన్‌లోని అత్తవారి వద్దకు వెళ్ళి ఆ రోజు అక్కడే పడుకుంది. మరుసటి రోజు కిందకు దిగి చూస్తే తాళాలు పగులగొట్టి ఉంది. లోపల బీరువాలో పెట్టిన 250 గ్రా ములు వెండి వస్తువులు కనిపించలేదు. ఇళ్లంతా వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షాపులో సేల్స్‌ట్యాక్స్ అధికారుల తనిఖీలు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని చర్చి సెంటర్లో గల ఆర్పుద్ర మొబైల్స్‌లో సేల్స్‌ట్యాక్స్ జీఎస్టీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకుండా విక్రయాలు జరుపుతున్నారని, ఇన్‌వాయిస్‌లు, కస్టమర్లకు ఇచ్చే బిల్లుల్లో వత్యాసాలు ఉంటున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు వారు షాపులోని రికార్డులు, బిల్లులు, కంప్యూటర్లను తనిఖీ చేశారు. షాపులో తనిఖీలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని సేల్స్‌ట్యాక్స్ సూపరింటెండెంట్ కమలాకర్ తెలిపారు. కాగా మొబైల్ షాపులో తనిఖీల చిత్రీకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యేసు బోధనలు అనుసరణీయం

» రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్ » రాజమహేంద్రవరంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలో కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడైన ఏసు క్రీస్తు ప్రేమానురాగాలు సమాజంలో ప్రజల మనుగడకు ఎంతో అవసరమని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దుర్గేష్ కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏసు క్రీస్తు జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఏసు క్రీస్తు సందేశాలు ఆచరించాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.70 కోట్లతో 945 చర్చిలకు మరమ్మతులు చేయించారని.. ఇప్పుడు కూడా క్రైస్తవులకు మంచి చేసేది కూటమి ప్రభుత్వమని అన్నారు. అనంతరం ప్రతాప్‌సిన్హా క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ సిన్హా, సుధీర్‌కుమార్, నాయకులు కాశి నవీన్‌కుమార్, గాలి సుబ్బరాజు, పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు పి.టాటా విక్టర్, ఎం.విజయసారధి, ఎ.మోజెష్‌బాబు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో అవమానకరంగా కించపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ సర్కిల్‌లో మంగళవారం ధర్నా చేశారు. బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చిత్ర సేను మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను తూలనాడుతూ అవమానకరంగా మాట్లాడారన్నారు. దీనికి యావత్ భారత్ జాతి దిగ్భ్రాంతికి గురైందన్నారు. తక్షణమే అతన్ని మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకురాలు మాయావతి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, న్యాయవాది పడమట గణేశ్వరరావు, ఇసుకపట్ల రాంబాబు, నల్లి రమేష్, కొండపల్లి సూరిబాబు, నక్క వెంకటరత్నం తదితరులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని విడిచి పెట్టారు.

ఎస్‌టీపీ ప్లాంట్ త్వరగా పూర్తి చేయాలి

కమిషనర్ కేతన్ గార్గ్



ప్లాంట్ వద్ద ప్లాను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్రాజెక్టులో భాగంగా రూ.95.50 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ 2025 నాటికి పూర్తి చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణాలను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. 50.6 ఎల్ఎల్‌డీ సివ్రేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ 2025 ఫిబ్రవరికి పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ గతంలో నిర్మించిన 30 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీ ప్లాంట్ వినియోగిస్తున్నామన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అదనంగా 50.6 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని నిర్మించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 33 శాతం పనులు పూర్తి చేశారని మిగిలిన అన్ని పనులు వేగంగా పూర్తి చేస్తారని చెప్పారు. ఆయన వెంట ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ షేక్ మదర్షాఅలీ, డీఈ విరూపాక్షరావు తదితరులు ఉన్నారు.

నీతి సూర్యుడు

ఉదయించె..

క్రీస్తునేడు పుట్టెను.. హల్లేలూయా

» ఘనంగా క్రిస్మస్ వేడుకలు
» విద్యుత్ కాంతుల్లో చర్చిలు
» శాంతాక్లాజ్ దుస్తుల్లో చిన్నారులు
» క్రైస్తవ ఆలయాల్లో ప్రార్థనలు



అనపర్తిలోని సిలువులమ్మ ఆలయంలో ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ, పశువుల పాక నమూనా





ఉండ్రాజవరం: వేలివెన్నులో విద్యుత్ అలంకరణలో జీడీఎమ్ చర్చి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ నెల ఆరంభం నుంచి వేడుకలు ఆరంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 14 ప్రధాన సంఘాల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. రక్షకుడు వచ్చాడని మంగళవారం క్రిస్మస్‌ను రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం ప్రాంతాల్లోని క్రైస్తవ సంఘాలు క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు చేశాయి. రాజమహేంద్రవరంలో 100 ఏళ్ళు పైబడి చర్చిలు జాంపేట సెయింట్ పాల్స్ చర్చ్, సుబ్రహ్మణ్యంమైదానంలోని హోలీట్రినిటీ చర్చ్, లూథరన్ చర్చ్, పునఃనిర్మాణం కాబడిన గ్లోరిడా చర్చ్, ధవళేశ్వరంలోని ఎస్ఎంయు చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న సుమారు 200 చర్చిలలో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం మరనాత బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో వెంకటాపురం సియోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాజానగరం మండలం కానవరంలో ఎపాత్ర ప్రార్థన మందిరలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.పాస్టర్ జి.శ్యామ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పాస్టర్ స్పర్జన్ బాబు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అనంతరం సంఘస్తులు ఆత్మీయ విందు స్వీకరించారు.

గోపాలపురం: క్రీస్తు జన్మదినం సందర్భంగా గోపాలపురంలో క్రిస్మస్ తాత వేషధారణలతో పాటు బాలికలు తెల్లని దుస్తులు ధరించి ర్యాలీ నిర్వ హించారు. హ్యాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల వెంబడి చిన్నారులు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చాగల్లు: చాగల్లు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొని చిన్నారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు బోధించినట్లుగా తోటివారి పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. చిన్నారులు క్రిస్మస్ తాత, శాంతాక్లాజ్ వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో సెక్టార్ లీడరు పి.వెంకటలక్ష్మి, సుశీల, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు క్రిస్మస్ తాత, శాంతాక్లాజ్ వేషధారణల్లో బెలూన్‌లు చేతపట్టుకుని ఆట పాటలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు మంగళవారం రాత్రి నుంచే ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో క్రీస్తు లూథరన్ చర్చి, బైబిల్ మిషన్, పెంతుకొస్తు, ఆర్‌సీఎమ్, జీడీఎమ్, క్రీస్తు సంఘం తదితర చర్చిలను సుందరంగా అలంకరించారు. వేలివెన్నులోని 1933 సంవత్సరంలో నిర్మించిన జీడీఎం చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. 92 సంవత్సరాలుగా చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి క్రీస్తు జన్మదిన వేడుకలను ప్రారంభిస్తున్నారు. చర్చిల వద్ద భారీ క్రిస్మస్ స్టార్‌లు, ట్రీలు ఏర్పాటు చేశారు.

కడియం: బుర్రిలంకలో కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి, జేటీ రామారావు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేకు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి స్ఫూర్తి దాయకమని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సమాజంలో ప్రేమ, సామరస్యం, సోదరభావాలు పెంపొందించేందుకు ఏసుక్రీస్తు బోధనలు దోహద పడతాయన్నారు. పాస్టర్లు ప్రార్థ... చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శారద, నాయకులు చైతన్యరెడ్డి, డాక్టర్ వడయార్, శ్రీను, హుస్సేన్, వెంకటేశ్వరరావు, మార్టిన్‌లూథర్ పాల్గొన్నారు. మురమండ గ్రామంలో దేవుని విశ్వాసులు కొవ్వొత్తులు చేతబట్టి హేపీ క్రిస్మస్ మేరీ క్రిస్మస్ అంటూ తిరిగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ప్రత్తిపాటి రామారావు చౌదరి పాస్టర్ సీహెచ్ ప్రసాదరావు, పల్లి వెంకట్రావు, కోటిపల్లి కిరణ్‌కుమార్, పల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలో కానవరంలోని గాయత్రీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులంతా క్రిస్మస్ తాత వేషధారణలతో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. చిన్నారులందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీవీవీఎస్ఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ దేవి బంగారం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజానగరంలోని దివ్య విద్యాసంస్థలు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వివిధ వేషధారణల్లో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, గీతాలాపనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఛైర్మన్ బర్ల సత్యనారాయణ,వైస్ ఛైర్మన్ బర్ల విజయ్,సెక్రటరీ బర్ల సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



గోపాలపురంలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు



బుర్రిలంకలో క్రిస్మస్ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



రాజమహేంద్రవరంలోని శాంతాక్లాజ్ వేషధారణలతో చిన్నారులు



రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కూటమి నాయకులు, రైతులు

సర్వేయర్‌ను నియమించరూ...

కోరుకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రెండు సంవత్సరాలుగా సర్వేయర్ లేరని నర్సాపురం గ్రామానికి చెందిన కూటమి నాయకులు, రైతులు రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం గ్రామంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రజని, ఇతర రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిపారు. టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ రాయపాటి సత్తిబాబు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రగడ జోగారావు, ప్రగడ దేవీవరప్రసాద్, సి.సీతారాం, పలువురు రైతులు తమ గ్రామానికి పర్మినెంట్ సర్వేయర్‌ను నియమించి అప్పుడు రెవెన్యూ సదస్సు నిర్వహించాలని పట్టుబట్టారు. తక్షణం సర్వేయర్‌ను నియమించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని రెవెన్యూ అధికారులకు అందజేశారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రజినికి వినతిపత్రం అందించారు. అనంతరం అధికారులు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఆక్రమణకు గురైన రాజమహేంద్రవరం వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 3.5 ఎకరాల భూమిని ఎండోమెంట్‌కు అప్పగించాలని దేవస్థానం ఈవో టి.రాజాబాబు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన ఆక్రమణకు గురైన 70 సెంట్ల భూమిని తమకు అప్పగించాలంటూ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అధికారులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు సర్వేకు 15 దరఖాస్తులు, మ్యుటేషన్‌కు ఒక ఫిర్యాదు, 22ఏ నిబంధ భూముల జాబితాకు రెండు పిటిషన్లు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ రజని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ కడియాల పాపారావు, రెవెన్యూ, ఎండోమెంట్, వ్యవసాయశాఖల అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు బీజేపీలో కంబాల చేరిక

ముఖ్య అతిథిగా విచ్చేయనున్న రాష్ట్రాధ్యక్షురాలు పురందేశ్వరి

గోకవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ, రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు 25న భారతీయ జనతా పార్టీలో చేరనున్నారు. ఇందుకోసం గోకవరం-తంటికొండ రోడ్డులో గల సీఎండీ లేఅవుట్‌లో బహిరంగ సభ ఏర్పాటు పనులను పూర్తి చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో శ్రీనివాసరావుతో పాటు, మరో పది వేలమంది బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. సభకు వచ్చేవారికి పలు సౌకర్యాలతో పాటు, భోజనాన్ని కూడా సిద్ధం చేస్తున్నారు. మండలం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



అందంగా ముస్తాబైన సభ

కడియంలో వైద్య శిబిరం

కడియం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కడియం గ్రామానికి చెందిన శాకా పట్టాభి, శాకా సురేష్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం డెల్టా ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. రెండు వందల మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ రూరల్ మాజీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు, బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు, జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, గ్రంధి నాగు, గుత్తుల వాసు, పున్నమిరాజు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

29న జిత్‌మోహన్‌మిత్రకు సన్మానం

రాజ మహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): నటగాయకుడు శ్రీపాద జిత్ మోహన్‌మిత్ర 70 వసంతాల గాన స్వర్ణోత్సవ వేడుకను ఈ నెల 29న వైజంక్షన్ అనం రోటరీ హాలులో నిర్వహించనున్నారు. పది మంది కళాకారులకు సత్కారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సంగీత ప్రియులు హాజరై దీన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఉచిత ఇసుకకు సొమ్ములు డిమాండ్ చేస్తున్నారు

కడియం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పెట్టినా ఇసుక ర్యాంపులో సొమ్ములు వసూలు చేస్తున్నారని జేగురుపాడు గ్రామానికి చెందిన సాకా కిరణ్‌కుమార్ అనే దళితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వివరాల ప్రకారం... ఈ నెల 23న వేమగిరి ర్యాంపులోకి ట్రాక్టర్ తీసుకుని ఇసుక కోసం వెళ్లానని, అక్కడ సతీష్ అనే గుమస్తా ట్రాక్టర్‌లోకి ఇసుక ఎగుమతి చేసే బంటాకు రూ.300, యూనియన్‌కు రూ.200 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ట్రాక్టర్‌ను ర్యాంపులోకి వెళ్లకుండా అడ్డుకున్నాడన్నారు. ట్రాక్టర్‌కు ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం చెప్పిందని, ఎందుకు ఇవ్వాలంటూ అడిగానన్నారు. తమ సర్పంచ్ యాదల స్టాలిన్‌కు ఫోన్ చేయగా, సతీష్‌తో ఆయన మాట్లాడినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సొమ్ములు కొంతమంది వసూలు చేయమన్నారని, ఇవ్వాల్సిందే అంటూ ర్యాంపులోకి వెళ్లనీయకపోవడంతో రూ.500 తీసుకుని ర్యాంపులోకి ట్రాక్టర్‌ను పంపించారన్నారు. దీనిపై తహశీల్దారు పోశిబాబుకు ఫిర్యాదు చేసినట్టు కిరణ్‌కుమార్ తెలిపారు.



సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజా, వైసీపీ నాయకులు

ఎస్ఐ మనోహర్‌పై చర్యలు తీసుకోవాలి

రాజానగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై చేయిచేసుకున్న ఎస్ఐ మనోహర్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తమ అనుచరులతో మంగళవారం రాత్రి రాజానగరం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. మండలంలోని తూర్పుగోనగూడెంలో కాలభైరవ స్వామి వేడుకల్లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా వద్ద సినిమా పాటల విషయం లో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో పోలీసులు ఇరువర్గాల యువకులపై కేసులు నమోదు చేశారు. ఒక వర్గంలోని యువకుడి ప్రవర్తనపై పోలీస్ స్టేషన్ వద్ద తల్లి ఎదురుగానే ఎస్ఐ మనోహర్ చేయి చేసుకున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, యువకుడిపై చేయిచేసుకున్న ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రాజా మాట్లాడుతూ ఎస్ఐపై కేసు నమోదు చేసి, బాధిత యువకుడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయనకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



మహిళా సమాఖ్య కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలి

డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజానగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్న లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. రాజానగరం మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని వీవోఏలకు మంగళవారం జరిపిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందుకు అనుగుణంగా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు గ్రామీణ మహిళలకు జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారన్నారు. సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, ఉన్నతి ఏపీఎం త్రిమూర్తి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విష్వక్సేన వాహనంలో ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

బిక్కవోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామివారికి బ్రహ్మోత్సవ సంకల్పం, అంకురార్పణ, దీక్షాధారణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి రామగోపాలకృష్ణ ఆచార్యులు, వేదాంతం పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిపిన విష్వక్సేణ పూజలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విష్వక్సేణ వాహనంలో మాఢవీదుల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి ప్రసాద వితరణ చేశారు. వచ్చేనెల 2 వరకు బ్రహ్మోత్సవాలు జరుపుతామని ఆయన తెలిపారు.

దొమ్మేరులో రోడ్డు నిర్మాణ పనులు

కొవ్వూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో సంతమార్కెట్ నుంచి జాతీయ రహదారి వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కాకర్ల నారాయుడు మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీ ణ ప్రాంత ప్రజలు, రైతుల సౌకర్యార్థం మండలంలోని దొమ్మేరు సం తమార్కెట్ నుంచి నేషనల్ హైవే వరకు మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, వాడవెల్లి సూర్యనారాయణ, కలగర రండారావు, రాధాకృష్ణ ప్రసాద్, ఆశపు సత్యనారాయణ, పీఆర్ ఈఈ ఎస్.శ్రీనివాస్, మండల ఏఈ సీహెచ్ త్రిమూర్తులు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆదిత్యలో వినియోగదారుల దినోత్సవంలో జేసీ చిన్నరాముడు

వినియోగదారులు ప్రశ్నించాలి

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ప్రశ్నించే తత్వం ఉండాలని జేసీ చిన్నరాముడు అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిపిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎక్కువసార్లు వాడిన ఆయిల్ వల్ల హెపటైటిస్ బి వ్యాధి వస్తుందన్నారు. వినియోగదారుల హక్కులను అడ్వకేట్ శ్రీను తెలిపారు. విద్యార్థులకు తమ లక్ష్యసాధనపై పట్టుదల ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి, కాలేజి డైరెక్టర్ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు 98 మంది పాల్గొన్నారు.

ఎస్‌పీఎం చైర్మన్ శ్రీనివాసరెడ్డికి సత్కారం



శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకుడు అన్నందేవుల చంటి

కడియం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ (ఏపీఎస్‌ఏఎం) చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని తాడేపల్లిలో మంగళవారం మాదవరాయుడుపాలెం సర్పంచ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి అన్నందేవుల చంటి కలిశారు. ప్రత్యేకంగా చేయించిన గజమాల, పూల కిరీటం పెట్టి ఏపీఎస్ఏఎం చైర్మన్ శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సరీ డైరెక్టర్ రావిపాటి రామకృష్ణ, సంగీత కొండ తదితరులు ఉన్నారు.



రక్షకుడు ఉదయించినాడు...

రక్షకుడు..ఉదయించినాడు!



క్రీస్తు రాకడకు : రాజమహేంద్రవరంలో ఒక చర్చి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైటింగ్



హ్యాపీ క్రిస్మస్ : చిన్నారులకు కేక్ తినిపిస్తున్న మంత్రి దుర్గేష్



గిఫ్ట్ తెచ్చేతాం : రాజానగరం మండలం కానవరంలో క్రిస్మస్‌తాత వేషధారణలో చిన్నారులు

క్రిస్మస్ పండుగ వచ్చేసింది.. సందడి తెచ్చేసింది.. ఎటు చూసినా క్రిస్మస్ కాంతులు వెదజల్లుతున్నాయి.. చర్చిలు విద్యుత్ ధగ ధగలతో మెరిసిపోతున్నాయి.. మరో వైపు విశ్వాసులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.. యువత వీధుల వెంట హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ ర్యాలీలు చేస్తూ తమ ఆనందం చాటుకుంటున్నారు.. డిసెంబరు ఆరంభం నుంచి జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా చేస్తున్నారు. నేడు క్రీస్తు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. త్వరగా రానున్న ఏసు.. త్వరగానే రమ్ము తండ్రి అంటూ కొలిచారు..

- వివరాలు 8వ పేజీలో

ఇంటింటా ఎన్‌సీడీ సర్వే
డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేతో పాటు విద్యార్థుల హెల్త్ స్ర్కీనింగ్‌లను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు.ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆహారపు అలవాట్లు,మెడికల్ హిస్టరీ అడిగి తెలుసుకుంటున్నారన్నారు. బీపీ, షుగర్, అనీమియా, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వారా కేన్సర్‌కు సంబంధించిన లక్షణాలను ప్రజలకు వివరిస్తూ వారికి ఇంటివద్దనే స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తున్నారన్నారు.జిల్లా ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ ఎన్‌సీడీ సర్వే, విద్యార్థుల హెల్త్ స్ర్కీనింగ్ వివరాలు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు దాటిన జనాభా 15,12,332 మంది ఉంటే ఇప్పటి వరకూ 2,40,134 మందికి స్ర్కీనింగ్ చేశారని పేర్కొన్నారు.రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెల్త్ స్ర్కీనింగ్ చేపడుతున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలలో 55 శాతం, స్కూళ్లలో 25 శాతం స్ర్కీనింగ్ నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

రాజమహేంద్రిలో రాత్రి 11 వరకూ షాపులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం రాత్రి 11 గంటల వరకూ వ్యాపార సంస్థలు తెరుచుకునేందుకు జిల్లా పోలీసు అధికారులు అనుమతివ్వడం జరిగిందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌ను ఆయన కార్యాలయంలో ఛాంబర్ అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణమూర్తి, గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వంటెద్దు సూరిబాబు, ఇయ్యపు మురళీధర్ తదితరులు కలిశారు. పండుగల నేపథ్యంలో తమకు వ్యాపార వేళలు పెంచాలని ఎస్పీని కోరగా వెంటనే స్పందించి అనుమతిచ్చారని తెలిపారు. అయితే ప్రతి షాపు వద్ద నిఘా కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి పూట పోలీసులు షాపుల తనిఖీలకు వచ్చిన సమయంలో నిఘా కెమెరాలు పర్యవేక్షణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారన్నారు.

8

అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ
రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

రుడాలో ఫైల్స్ త్వరగా క్లియర్ చేయండి
రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

పేద గూటికి.. పండగొచ్చేనా!
టిడ్కో ఇళ్లపై పేదింట ఆశలు



కొవ్వూరులో టిడ్కో ఇళ్లు

బొమ్మూరులో ఇంటిని అల్లుకున్న నిర్లక్ష్యం

మేడంటే మేడా కాదు..గూడంటే గూడు కాదు.. అందంగా కట్టుకున్న పొదరిల్లు మాది.. పొదరిల్లు మాది..ఐదేళ్ల కిందట టిడ్కో గృహాలపై పేదల పాట ఇది.. అంత వేగంగా గృహ నిర్మాణాలు సాగాయి మరి. రేపో మాపో ఇల్లు వచ్చేస్తుందని చాలా మంది పేదలు ఆశలు పెట్టుకున్నారు. 2019లో జగన్ మాటలు నమ్మి ఓటేశారు..ప్రభుత్వం మారింది.. ఐదేళ్లు పేదిళ్ల వైపే చూడలేదు..ఎందుకంటే పేదింటికి వైసీపీ చీడ పట్టేసింది. దీంతో పేదలు నలిగిపోయారు. టైమ్ చూసుకున్నారు..ఎన్నికలు రావడంతో ఓటుతో జగన్‌ను దింపేసి కూటమికి ఛాన్స్ ఇచ్చారు..ప్రస్తుతం టిడ్కో ఇళ్లకు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపడుతోంది.



బొమ్మూరులో నిర్మించిన టిడ్కో గృహాలు

- పేదింటికి పట్టిన వైసీపీ చీడ
- గత ఐదేళ్లూ గాలికొదిలేశారు
- ఒక్క ఇంటినీ ఇవ్వని జగన్
- 2019లో నిర్మాణాలు పూర్తి
- ఐదేళ్లు కానరాని వసతులు
- ఈఎంఐలతో సతమతం
- పట్టించుకోని నాయకులు
- కూటమి రాకతో ఆనందం
- టిడ్కో పనులపై కదలిక

రాజమహేంద్రవరం/కొవ్వూరు/ నిడదవోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా ప్రజలకు సంబంధించిన కనీస అవసరాలు తీర్చే బాధ్యత సుకోవలసిందే.కానీ ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికలైన తర్వాత మరో మాట చెప్పేధోరణి గత ప్రభుత్వంలో బాగా కనిపించింది. పేదల ఇంటి కలను గత వైసీపీ ప్రభుత్వం దూరం చేసింది. జ గనన్న ఇళ్లు అంటూ హడావుడి చేసినా టీడీపీపై కోపంతో కట్టిన ఇళ్లను చెదలు పట్టించింది. ఐదేళ్లు ఎందుకూ పనికిరాకుండావదిలేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పట్టణ ప్రాంతాల్లో వేలాది మంది పేదలకు అందమైన ఇంటిని ఇవ్వాలనే లక్ష్యంతో రాజమహేంద్రవరం, నిడదవో లు, కొవ్వూరు పట్టణాలకు దగ్గరగా టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే.2019 ఎన్నికలకు ముందే మొదటి దశ ఇళ్లను ఇవ్వడానికి సిద్ధం చేసింది. అప్పట్లో గృహ ప్రవేశాలు కూడా చేశారు. కానీ 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టడం మొదలైంది.టిడ్కో గృహాలు ఐదేళ్లు ధ్వంసమయ్యాయి. లబ్ధిదారులకు దక్కకుండా వృథాగా పడి ఉన్నాయి.కొన్ని శిధిలమైపోయాయి.రెండో దశలో మొదలైన ఇళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.

అధ్వానంగా తయారైన ఇళ్లు..

టిడ్కో ఇళ్లను టీడీపీ చాలా వరకూ పూర్తి చేసింది.అయితే తర్వాత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. దీంతో ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించలేని పరిస్థితి నెలకొంది. ఇవాళ మళ్లీ కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకుని..అప్పగిస్తుందనే ఆశలో లబ్ధిదా రులు ఉన్నారు. అయితే ఐదేళ్లు పట్టించు కోకపోవడంతో ఇళ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇళ్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వర్క్సు, ప్లంబింగ్ వర్కులకు సంబంధించిన మెటీరియల్ చోరీకి గురైంది. నామవరంలో రెండో దశలో నిర్మించిన 1104 ఇళ్ళలో రూ.3 కోట్ల విలువైన ఎలక్ట్రికల్,ప్లంబింగ్ మెటీరియల్ చోరీకి గురైనట్లు అక్కడి కాంట్రాక్ట తరపు వ్యక్తులు చెబుతున్నారు.

ప్రస్తుతం బొమ్మూరు మొదటి దశ, తొర్రేడు, సింహాచలం నగర్ కాలనీల్లో కొంతమంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు.మిగతా చోట్ల కనీస మౌలిక సదుపాయాల్లేవు.నామవరం డి.బ్లాక్ వద్ద నిర్మించిన ఇళ్లలో 96 ఇళ్లను లబ్ధి దారులకు అప్పగించినా ఒక్కరే ఉంటున్నారు. నిడదవోలులో శ్లాబ్ కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది.ఇక కొవ్వూరులో నిర్మాణం పూర్తయినా మౌలిక వసతుల్లేవ్.

జిల్లా పరిధిలో రాజమహేంద్రవరంలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కోఇళ్లు నిర్మించారు. అందులో 5,574 మందికి రిజిస్ర్టేషన్లు పూర్తయ్యాయి.ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలా తక్కువ మంది మాత్రమే గృహప్రవేశాలు చేసుకున్నారు. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. నిడదవోలులో 1755 ఇళ్లు మంజూరు కగా 1248 ఆరంభించారు. కొవ్వూరు 480 మంజూరు కాగా 480 ఆరంభించారు. కానీ మధ్యలో ఆపేశారు. బొమ్మూరులో మొదటి దశలో 2,528 ఇళ్లు నిర్మించారు.తొర్రేడులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళేశ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు. ఇప్పటి వరకూ బొమ్మూరులో నిర్మించిన ఇళ్లలో 2,528 ఇళ్లను లబ్ధిదార్లకు అప్పగించగా 1977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు.బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు.అక్కడ

ఎక్కడ ఇళ్లు అక్కడే!

ఎస్‌టీపీ పనులు పూర్తి చేయవలసి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులు పొందారు. ధవళేశ్వరం(వడ్డెరకాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్పగించారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లలో 96 లబ్ధిదారులకు అప్పగించినా ఎవరూ రాలేదు. కేవలం ఒక్కరు మాత్రమే ఇక్కడ నివాసం ఉంటున్నారు. కనీస సౌకర్యాలు లేవు. రెండో దశలో నామవరంలో 1104 ఇళ్లు, సింహాచలనగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1200 నిర్మించారు.ఇవి ఇంకా పూర్తి కాలేదు.మౌలిక సదుపాయాలు కల్పించలేదు.నిడదవోలు పట్టణం తీరుగూడెంలో 1755 మంజూరు కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు.లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా జరగలేదు.ఇళ్ల నిర్మాణం ఆగింది. బిల్లులు రాకపోవడంతో పెండింగ్‌లో పడింది.

3 రకాలుగా ఇళ్ల నిర్మాణం

జిల్లాలో మొత్తం మూడు రకాలుగా ఇళ్లను విభజించారు. 300 ఎస్ఎఫ్‌టీ, 365 ఎస్ఎఫ్‌టీ, 430 ఎస్ఎఫ్‌టీగా లబ్ధిదార్లను ఎంపిక చేశారు. 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్లను ఉచితంగా ఇచ్చారు. ఇక 365 ఎస్ఎఫ్‌టి ఇళ్లకు రూ.3.15 లక్షల రుణం, రూ.25 వేలు లబ్ధిదారుడి వాటాగా నిర్ణయించా 430 ఎస్ఎఫ్‌టీ ఇళ్లకు రూ.3.65 లక్షలు రుణం, రూ.50వేలు లబ్ధిదారుడి వాటాగా నిర్ణయించారు. మొదట్లో టీడీపీ ఎంపిక చేసిన లబ్ధిదార్లలో కొంతమందిని వైసీపీ మార్చేసింది. రుణాలు కూడా సరిగ్గా ఇప్పించలేదు.



బొమ్మూరులో అసంపూర్తిగా నిలిచిన ఓహెచ్ఆర్

ఈఎంఐలతో సతమతం

సొంతింటి కల నెరవేరుతుందని ఎంతో ఆశతో లక్ష రూపాయలు చెల్లించిన లబ్ధిదారులు కట్టిన లక్ష సొమ్ముకు వడ్డీలు కట్టలేక, మరో పక్క నివాసం ఉంటున్న ఇంటికి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. మరో పక్క టిడ్కో గృహాలపై రుణాలు మంజూరుచేసిన బ్యాంకర్లు లబ్ధిదారులను ఈఎంఐలు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాలు అందజేస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



టిడ్కో ఇళ్లపై సమీక్ష

కలెక్టరేట్‌లో ఇళ్లపై చర్చ

కూటమి అధికారంలోకి రావడంతో ఈ ఇళ్లను త్వరగా పూర్తి చేసి అప్పగిస్తారనే ఆశ మొదలైంది. దానికి తగ్గట్టుగానూ యంత్రాంగం కదులుతుంది. కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్ ఇతర అధికారులతో టిడ్కో ఇళ్ల పరిస్థితిని సమీక్షించారు.

కొవ్వూరులో 480 కట్టేశారు.. వదిలేశారు?

కొవ్వూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని పెద తాళ్లపుంతలోని ఎన్టీఆర్‌నగర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో 2018 మార్చి 2వ తేదీన రూ.31.27 కోట్లతో 480 గృహాల నిర్మాణం చేపట్టారు. వాటిలో 300 చదరపు అడుగులు సింగిల్ బెడ్ రూమ్ గృహాలు 240, 430 చదరపు అడుగులు డబుల్ బెడ్‌రూమ్ గృహాలు 240 నిర్మించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు గృహ నిర్మాణం పూర్త యింది. గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే గృహప్రవేశం చేసుకోవచ్చు. అయితే వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల ఆ పని చేయలేకపోయింది. టిడ్కో గృహాల సముదాయంలో నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేసింది. దీం తో కొన్నిళ్లు దెబ్బతిన్నాయి. టిడ్కో గృహాల సముదాయం పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిలా మారింది.లబ్ధిదారులకు ఇదిగో ఇస్తున్నాం.అదిగో ఇస్తున్నాం అన్నారే తప్ప వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాల వద్ద చిన్నపనిచేసిన పాపాన పోలేదు.



చెక్కేయండి.. జగన్ బొమ్మలు!

అంతా నా ఇష్టం.. అంతా నా ఇష్టం.. అన్నారు గత సీఎం జగన్.. కనిపించిన చోటల్లా తన బొమ్మను వేసేసుకున్నారు..అది భూమీ లేదు.. పాస్‌బుక్‌లేదు.. రేషన్‌కార్డు లేదు.. చివరికి ఇంటి పట్టాలపై కూడా ఆయన ఫొటోనే.. అంతా చూశారు.. చివరిలో పొలం సరిహద్దు రాళ్లపైనే ఆయన ఫొటోనే వేశారు..రైతులకు ఏమీ అర్థం కాలేదు.. ఎవరి పొలం వాళ్ల ఆధీనంలోనే ఉండాలని రైతులు కోరుకుంటారు.. మరొకరిని రానీయరు.. తమ పొలంలో వేరొకరిని చూడడానికి రైతులు ఇష్టపడరు.అయితే దర్జాగా జగన్ మాత్రం సరిహద్దు రాళ్లపై తన బొమ్మలు విచ్చలవిడిగా వేసేసుకున్నారు.. రైతుల నుంచి ఆ బొమ్మలు తొలగించాలని పెద్ద ఎత్తున అర్జీలు రావడంతో అధికారులు తొలగింపు చర్యలు చేపడుతున్నారు.. కొవ్వూరు మండలం సీతంపేట గ్రామ సచివాలయం వద్ద తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం చిగురులంక, మద్దూరులంకలకు సంబంధించి రెవెన్యూ సదస్సును నిర్వహించారు.ఆర్‌డీవో రైతుల నుంచి 12 వినతులు స్వీకరించారు. అక్కడే ఉన్న సర్వే రాళ్లపై జగన్ బొమ్మలను తొలగించడం చూశారు. - **కొవ్వూరు**

వేతన సవరణ కార్మికులు ఆమోదించాలి

- పేపరుమిల్లు యాజమాన్యంతో చర్చించిన నాయకులు
- రూ.12,500 పెంపునకు అంగీకారం.. కార్మికుల అసంతృప్తి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం పేపరు మిల్లు యాజమాన్యం కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన సవరణ చేయాలని మంత్రి దుర్గేష్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మిల్లు యాజమాన్యం, కార్మిక శాఖ కమిషనర్,కార్మికులతో మంగళవారం 2020-23 వేతన సవరణపై సమీక్షించారు. నాలుగు నెలల కిందట నిర్వహించిన సమావేశంలో ఆమోదయోగ్యమైన వేతన సవరణ చేయడం జరుగుతుందని పేపరుమిల్లు యాజమాన్యం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో రూ.12250ల వేతన పెంపునకు అంగీకారం తెలిపినా ప్రస్తుత సమావేశంలో రూ.12500లకే పరిమితం కావడంపై కార్మికులు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకె ళ్లడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పేపరుమిల్లు యాజమాన్యం ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలను పాటించడం లేదన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు రూ.13 కోట్లు బకాయి మొత్తాన్ని చెల్లించాలన్నారు. వేతన సవరణ విషయంలో మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు.రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి వేతన సవరణ చేయాల్సి ఉన్నా యాజమాన్యం మొండి వైఖరి కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి నీటి వినియోగంపై ఆడిటింగ్ చేపట్టాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పేపరుమిల్లు యాజమా న్యం చేసిన అవినీతి, ఉల్లంఘనలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ విభజించు పాలించు అనే పోకడలో పేపరుమిల్లు యాజమాన్యం వ్యవహరిస్తున్న ట్లు ఆరోపించారు.సమావేశంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జాయింట్ లేబర్ కమిషనర్ ఏ.రాణి, సహాయ కార్మిక అధికారి ఎస్కేజాబీనా,డీఎస్పీ ఏకే సుబ్బరాజు,పేపరుమిల్లు అసోసియేట్ డైరెక్టర్ అక్కినేని జయకృష్ణ,యాజమాన్యం ప్రతినిధులు మేనేజరు బాగ్లే,బిజాయి కుమార్‌సంకు, హెచ్ ఆర్ గణేష్,ఫైనాన్స్ హెడ్ రిషికాంత్‌గుప్తా, సీఎస్ఆర్ మేనేజరు డి.తాతారావు, కార్మిక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పొగాకుకు మానుమచ్చ తెగులు



మానుమచ్చ తెగులు సోకిన పొగాకు మొక్క

- తలలు వాల్చి ఎర్రబడి చనిపోతున్న మొక్కలు
- దిగుబడిపై రైతుల్లో ఆందోళన

గోపాలపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అసలే నాట్లు ఆలస్యంగా పడ్డాయని, ఇప్పుడు వరుస తుఫాన్ హెచ్చరికలు అంటూ పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పొగాకు సాగుకు వాతావరణం అనుకూలించక పోవడంతో నాట్లు చివర దశలో నాటారు. ఆలస్యంగా నాట్లు నాటామని ఊపిరి పీల్చుకున్న రైతులకు ప్రస్తుతం తుఫాన్ నేపథ్యంలో వాతావరణంలో మార్పులు కలవరపెడుతున్నాయి. ఇదిలా ఉండగా పొగాకు తోటలకు మానుమచ్చ తెగులు వెంటాడుతుండడంతో ఏపుగా పెరిగిన మొక్కలు ముందు తలవాల్చి ఎర్రబడడం తరువాత చనిపోవడం జరుగుతోంది. దీనికి తోడు తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో పొగాకు ఆకులపై బ్రౌన్ స్పాట్ ఏర్పడడం, ఆకులకున్న జిడ్డు రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీని ప్రభావంతో పొగాకుకు బరువు తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు.ఇలాగే పొగాకు సాగును తుఫాన్ వెంటాడితే ఈ ఏడాది దిగుబడి తగ్గే ప్రమాదముందని భావిస్తున్నారు.

గోపాలపురంలో నకిలీ విలేకరులు

వెంటనే అరెస్టు చేయండి.. పోలీసులకు ఎలక్ట్రానిక్ మీడియా సభ్యుల వినతి



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు

దేవరపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గంలో కొంతమంది విలేకర్లుగా చెలామని అవుతూ ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులను బెదిరింపులకు గురి చేస్తున్నారని, అలాంటి నకిలీ విలేకర్లను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యంకు గోపాలపురం నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ నకిలీ విలేకర్లకు కొంతమంది విలేకర్లు షాడోగా ఉంటూ వసూళ్లకు తెగబడుతున్నారని పైగా తామే విలేకర్లమంటూ ఎవరూ లేరని ఇతరులను పట్టించుకోవల్సిన పనిలేదని వారు అంటున్నారని కొంతమంది అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చారని ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ సుబ్రహ్మణ్యం స్పందిస్తూ ఎవరైనా నకిలీ విలేకర్లు అధికారుల వద్దకు వచ్చి బెదిరిస్తే తమకు సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షుడు నాగార్జున, ఉపాధ్యక్షుడు మురళీ, కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నివాస్, ప్రసాద్, నాగేంద్ర, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నల్లజర్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో వారాణాసిలోని బనారస్ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 22 వరకు జరిగిన జాతీయ స్థాయి 9వ మామ అల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో దూబచర్ల ఎలైట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించినట్టు ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 16 రాష్ట్రాల నుంచి 1200మంది విద్యార్థులు పాల్గొనగా తమ విద్యార్థులు పి.లోహిత్ చౌదరి(8వ తరగతి), వై.తనుష్ (9వ తరగతి) కరాటేలో బంగారు పతకాలు, కుమిట్ విభాగంలో కాంస్య పతకాలు సాధించగా షేక్ జఫర్‌బాషా కరాటేలో వెండి పతకం సాధించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వై.సుదర్శనరావు, జి.సుబ్బారావు, కరాటే కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్
- రాజమహేంద్రవరంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలో కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడైన ఏసు క్రీస్తు ప్రేమానురాగాలు సమాజంలో ప్రజల మనుగడకు ఎంతో అవసరమని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దుర్గేష్ కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏసు క్రీస్తు జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఏసు క్రీస్తు సందేశాలు ఆచరించాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.70 కోట్లతో 945 చర్చ్‌లకు మరమ్మతులు చేయించారని.. ఇప్పుడు కూడా క్రైస్తవులకు మంచి చేసేది కూటమి ప్రభుత్వమని అన్నారు. అనంతరం ప్రతాప్‌సిన్హా క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ సిన్హా, సుధీర్‌కుమార్, నాయకులు కాశి నవీన్‌కుమార్, గాలి సుబ్బరాజు, పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు పి.టాటా విక్టర్, ఎం.విజయ సారథి, ఎ.మోజేష్‌బాబు పాల్గొన్నారు.

దొమ్మేరులో రోడ్డు నిర్మాణ పనులు



దొమ్మేరులో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో సంత మార్కెట్ నుంచి జాతీయ రహదారి వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కాకర్ల నారాయుడు మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతుల సౌకర్యార్థం మండలంలోని దొమ్మేరు సంతమార్కెట్ నుంచి నేషనల్ హైవే వరకు మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, వాడవెల్లి సూర్యనారాయణ, కలగర రండారావు, రాధాకృష్ణ ప్రసాద్, ఆశపు సత్యనారాయణ, పీఆర్ ఈఈ ఎస్.శ్రీనివాస్, మండల ఏఈ సీహెచ్ త్రిమూర్తులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



గౌరీపట్నంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు, ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సుల దోహదపడతాయని తహశీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గౌరీపట్నంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ సదస్సుకు 7 అర్జీలు వచ్చాయన్నారు. ఎఫ్‌లైన్‌కు రెండు, ఆర్వోఆర్‌కి రెండు, మీసేవా సర్వీసులపై మూడు అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని సత్యవాడ, చిలకపాడు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో డిప్యూటీ తహశీల్దార్ ఎం.హరిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. రైతులకు సంబంధించి భూసమస్యలు ఉంటే వాటిని ఈ సదస్సుల ద్వారా తక్షణమే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. రెండు గ్రామాల్లో ఏడు అర్జీలు స్వీకరించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, ఆర్ఐ రవిచంద్ర, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



సత్యవాడలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నీతి సూర్యుడు ఉదయించె..

క్రీస్తు నేడు పుట్టెను..

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- విద్యుత్ కాంతుల్లో చర్చిలు
- శాంతాక్లాజ్ దుస్తుల్లో చిన్నారులు
- క్రైస్తవ ఆలయాల్లో ప్రార్థనలు



అనపర్తిలోని సిలువులమ్మ ఆలయంలో ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ, పశువుల పాక నమూనా





ఉండ్రాజవరం: వేలివెన్నులో విద్యుత్ అలంకరణలో జీడీఎం చర్చి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ నెల ఆరంభం నుంచి వేడుకలు ఆరంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 14 ప్రధాన సంఘాల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. రక్షకుడు వచ్చాడని మంగళవారం క్రిస్మస్‌ను రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం ప్రాంతాల్లోని క్రైస్తవ సంఘాలు క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు చేశాయి. రాజమహేంద్రవరంలో 100 ఏళ్ళు పైబడి చర్చిలు జాంపేట సెయింట్ పాల్స్ చర్చ్, సుబ్రహ్మణ్యంమైదానంలోని హోలీట్రినిటీ చర్చ్, లూథరన్ చర్చ్, పునఃనిర్మాణం కాబడిన గ్లోరిడా చర్చ్, ధవళేశ్వరంలోని ఎస్ఎంయు చర్చ్‌లలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న సుమారు 200 చర్చ్‌లలో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం మరనాత బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో వెంకటాపురం సియోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాజానగరం మండలం కానవరంలో ఎపాత్ర ప్రార్థన మందిరలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.పాస్టర్ జి.శ్యామ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పాస్టర్ స్వర్గన్ బాబు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అనంతరం సంఘస్తులు ఆత్మీయ విందు స్వీకరించారు.

గోపాలపురం: క్రీస్తు జన్మదినం సందర్భంగా గోపాలపురంలో క్రిస్మస్ తాత వేషధారణలతో పాటు బాలికలు తెల్లని దుస్తులు ధరించి ర్యాలీ నిర్వహించారు. హ్యాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో చిన్నారులు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చాగల్లు: చాగల్లు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొని చిన్నారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు బోధించినట్లుగా తోటివారి పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. చిన్నారులు క్రిస్మస్ తాత, శాంతాక్లాజ్ వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో సెక్టార్ లీడరు పి.వెంకటలక్ష్మి, సుశీల, గంగాభవాని పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు క్రిస్మస్ తాత, శాంతాక్లాజ్ వేషధారణల్లో బెలూన్‌లు చేతపట్టుకుని ఆటపాటలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు మంగళవారం రాత్రి నుంచే ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో క్రీస్తు లూథరన్ చర్చి, బైబల్ మిషన్, పెంతుకొస్తు, ఆర్‌సీఎమ్, జీడీఎమ్, క్రీస్తు సంఘం తదితర చర్చిలను సుందరంగా అలంకరించారు. వేలివెన్నులోని 1933 సంవత్సరంలో నిర్మించిన జీడీఎం చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. 92 సంవత్సరాలుగా చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి క్రీస్తు జన్మదిన వేడుకలను ప్రారంభిస్తున్నారు. చర్చిల వద్ద భారీ క్రిస్మస్ స్టార్‌లు, ట్రీలు ఏర్పాటు చేశారు.

కడియం: బుర్రిలంకలో కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి, జేటీ రామారావు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేకు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తి దాయకమని విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సమాజంలో ప్రేమ, సామరస్యం, సోదరభావాలు పెంపొందించేందుకు ఏసుక్రీస్తు బోధనలు దోహద పడతాయన్నారు. పాస్టర్లు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శారద, నాయకులు చైతన్య రెడ్డి, డాక్టర్ వడయార్, శ్రీను, హుస్సేన్, వెంకటేశ్వరరావు, మార్టిన్‌లూథర్ పాల్గొన్నారు. మురమండ గ్రామంలో దేవుని విశ్వాసులు కొవ్వొత్తులు చేతబట్టి హేపీ క్రిస్మస్ మేరీ క్రిస్మస్ అంటూ తిరిగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ప్రత్తిపాటి రామారావుచౌదరి పాస్టర్ సీహెచ్ ప్రసాదరావు, పల్లి వెంకట్రావు, కోటిపల్లి కిరణ్‌కుమార్, పల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలో కానవరంలోని గాయత్రీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులంతా క్రిస్మస్ తాత వేషధారణలతో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. చిన్నారులందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీవీవీఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ దేవి బంగారం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజానగరంలోని దివ్య విద్యాసంస్థలు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వివిధ వేషధారణల్లో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, గీతాలాపనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ బర్ల సత్యనారాయణ,వైస్ చైర్మన్ బర్ల విజయ్,సెక్రటరీ బర్ల సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పాపుల రక్షకుడు యేసుక్రీస్తు

గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్



దేవరపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మానవుని పాపాలను కడిగి వేయడానికి ఏసుక్రీస్తు జన్మించాడని గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ అన్నారు. నిర్మలగిరి క్షేత్రంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం ఏసుప్రభు పరలోకం నుంచి భూమిపై మానవ రూపంలో పుట్టారని, ఆయన జన్మ గురించి మనదేశంలో అనేక గ్రంథాలు, వేదాల్లో ప్రచురించారని చెప్పా రు. ప్రతిఒక్కరు శాంతియుతంగా జీవించాలని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛమైన పాలన అందించాలన్నారు. కాగా క్రిస్మస్ సందర్భంగా నిర్మలగిరిలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు.



గోపాలపురంలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు



చాగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకలు



రాజమహేంద్రవరంలోని శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు

బీఎల్‌వోలకు గౌరవ వేతనం చెల్లింపుపై హర్షం

తాళ్లపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా బీఎల్‌వోలకు రావలసిన గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం పట్ల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గెద్దం గణేష్ హర్షాన్ని వ్యక్తం చేశారు. గౌరవ వేతనంపై మూడేళ్లుగా ఎన్నో వినతులు చేసినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన వెంటనే స్పందించి నిధులను విడుదల చేయడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అపరిష్కృతంగా ఉన్న సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తాళ్లపూడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక హంస వాహినీ స్కూల్ విద్యార్థులు మంగళవారం ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కొంతమంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పరస ప్రభాకరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచీ విద్యార్థులకు దాతృత్వం గురించి అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుడాలో ఫైల్స్ త్వరగా క్లియర్ చేయండి

తొలి సమీక్షలో చైర్మన్ బీవీఆర్ ఆదేశం



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా పరిధిలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫైల్స్ త్వరగా క్లియర్ చేయాలని చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. రుడా కార్యాలయంలో మంగళవారం రుడా వీసీ ,కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ప్లానింగ్ అధికారులతో ఆయన తొలి సమీక్ష నిర్వహించా రు. రుడా నిధులతో జరుగుతున్న పనులు, ఇంజ నీరింగ్ వర్కులు, ప్లానింగ్ విభాగంలో మాస్టర్ ప్లాన్లు, ఎల్ఆర్ఎస్, ఏపీడీపీఎంఎస్ ఫైల్స్‌పై చర్చించారు. త్వరలో రుడా పరిధిలోని నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని బొడ్డు వెంకటరమణ చౌదరి స్పష్టం చేశారు.

కొవ్వూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరు పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి, చైర్‌పర్సన్ బావన రత్నకుమారి.. విజయవాడలో వరదల సమయంలో సేవలందించిన 30 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీచేశారు. అలాగే ఈనెల 21న కొవ్వూరులో నిర్వహించిన జాబ్‌మేళాలో సేవలం దించిన మున్సిపల్, సచివాలయ సిబ్బందికి మెమెంటోలు అందించి సత్కరించారు. రత్నకుమారి మా ట్లాడుతూ పారిశుధ్య కార్మికులు లేకపోతే ఏ పట్టణం పరిశుభ్రంగా ఉండదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో బుడమేరుకు వరదలు రావడంతో సీఎం చంద్రాబాబు ఆదేశాలతో ప్రజా ప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని మున్సిపాల్టీల నుంచి అధికారులు, పారిశుధ్య కార్మికులు వెళ్లి సేవలందించారన్నారు. 2027లో గోదావరి నదికి పుష్కరాలు రానున్నందున కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. యాత్రికులకు అసౌక ర్యం కలుగకుండా పారిశుధ్యాన్ని మెరుగుపర్చి ఆదర్శవంత మున్సిపాల్టీగా తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మేనేజర్ పి.సాయిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

తాళ్లపూడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి పరామర్శించారు. దుర్గారావు తల్లి వీరమ్మ (102)ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో దుర్గారావు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నాయుడు హనుమంతరావు, ఉడతా వీరేంద్ర పాల్గొన్నారు.

కొవ్వూరులో రైళ్ల హాల్ట్‌కు ఎంపీ కృషి

- త్వరలో ఐదు రైళ్ల నిలుపుదల
- బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర



ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో నిలిపివేసిన రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించడానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కృషిచేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఎంపీని కలిసి కొవ్వూరులో రైళ్ల హాల్ట్‌పై వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు కొవ్వూరు జరిగిన విలేకరుల సమావేశంలో పిక్కి నాగేంద్ర, 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ కారణంగా నిలుపుదల చేసిన రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించకపోవడంతో కొవ్వూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాల్లో 100కు పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై గత ప్రభుత్వంలో కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశామన్నారు. మంగళవారం పురందేశ్వరిని కలిసి మరోసారి వినతిపత్రం అందించామన్నారు. కొవ్వూరు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశామన్నారు. దీంతో ఆమె కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌తో మాట్లాడారని, కొవ్వూరు ప్రజల సౌకర్యార్థం అత్యవసరంగా 5 రైళ్లను (సర్కార్, సింహాద్రి, తిరుమల, తిరుపతి ఎక్స్‌ప్రెస్, రాజమహేంద్రవరం టు భీమవరం వెళ్లే రైళ్లను) నిలుపుదల చేయాలని కోరారన్నారు. ఈ నెల 29న అశ్వినివైష్ణవ్‌ను కలవడానికి అపాయింట్‌మెంటు కోరారన్నారు. త్వరలో మరో 5 రైళ్లు కొవ్వూరులో ఆగుతాయని బీజేపీ నాయకులు అన్నారు. అయితే కొందరు కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టేలా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో బోడపాటి ముత్యాలరావు, మాట్లా అంజనేయులు, ముప్పరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ

పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్‌ను అమితంగా గౌరవించే పార్టీ బీజేపీ అని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ తమ నాయకుడు అని అనేక సార్లు గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీ ఆయన్ను రెండు సార్లు ఎన్నికల్లో ఘోరంగా ఓడించి పార్లమెంట్‌లో అడుగు కూడా పెట్టనీయలేదన్నారు. బీజేపీకి రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం కానీ, రాజ్యాంగాన్ని మార్చాలనే భావన కానీ ఏనాడూ లేదన్నారు. ఆర్టికల్ 356ను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని, అశేష ప్రజాదరణ కలిగిన ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి తర్వాత ఆంధ్రుల అభిమానం కారణంగా ఒత్తిడి రావడంతో మళ్లీ ఎన్టీఆర్‌కు పట్టం కట్టారని చరిత్ర దీనికి సాక్ష్యం అని అన్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ ఆధునీకరణ విషయంలో ప్రతిపాదనలన్నీ రైల్వే బోర్డుకు వెళ్లాయన్నారు. కొవిడ్ కారణంగా కొవ్వూరు, నిడదవోలు స్టేషన్లలో రద్దు చేసిన కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను స్థాపెజీ తొలగించారని, దీన్ని పునరుద్ధరించేందుకు రెండుసార్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మూడుపార్టీల పొత్తులో ఉన్న నేపథ్యంలో నామినేటెడ్ పదవుల షేరింగ్ పాట్రన్‌కు అనుగుణంగానే తమ వారికి పదవులు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి జరిగితే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో 184 కిలోమీటర్ల పొడవైన ఎర్రకాలువకు సంబంధించిన ఆధునీకరణపై కలెక్టర్‌ను డీపీఆర్ కోరినట్టు చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయని పురందేశ్వరి అన్నారు.